# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 02-06-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **'పీఎం సూర్య ఘర్' పథకం ద్వారా రాష్ట్రంలో సౌర విద్యుత్‌ను ప్రోత్సాహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.**

2. **ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.**

3. **తెలంగాణ వ్యాప్తంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ ఉత్సవాలను ఈరోజు నిర్వహిస్తున్నారు.**

4. **ఆంధ్రప్రదేశ్ లో వసతి గృహాల మరమ్మతులకు 143 కోట్ల రూపాయలను కేటాయించినట్లు మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి వెల్లడించారు.**

==========================

'ప్రధానమంత్రి సూర్య ఘర్' పథకం ద్వారా సౌర విద్యుత్ ను ప్రోత్సాహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.పల్నాడు జిల్లా నకిరేకల్లు మండలం కండ్లకుంట గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను నరసారావు పేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలుతో కలిసి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కండ్లకుంట గ్రామంలో తొలి విడతలో ఎంపికైన 120 ఇళ్లలో ఇప్పటికే 60 ఇళ్లకు పీఎం సూర్య ఘర్ సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల విద్యుద్దీకరణ కోసం అదనపు విద్యుత్ స్తంభాల ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ల ఆధునికీకరణకు చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలియజేస్తూ..

వాయిస్ ..30.. సెకన్లు

--------------------------

పెట్టుబడులు కోసం వేగవంతమైన వాణిజ్య విధానాలను అమలు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మహారాష్ట్రలోని ముంబైలో నిర్వహించిన 2026 ఇండియా కాన్ఫరెన్స్‌లో మంత్రి నిన్న పాల్గొన్నారు. "భారతదేశాన్ని భవిష్యత్‌కు సిద్ధం చేయడం – ఆంధ్రప్రదేశ్ అనుభవం" అనే అంశంపై జరిగిన చర్చలో ఆయన ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ పురోగతికి మూడు ప్రధాన కారణాలు ఉన్నాయని తెలిపారు. వాణిజ్య విధానాలు, నగరాల నిర్మాణం, ఎకోసిస్టమ్‌ల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు లభించాయని మంత్రి లోకేష్ వివరించారు.

--------------------------

తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కొతారి గ్రామపంచాయతీలోని కొత్తగూడలో గృహనిర్మాణ శాఖ నిర్మించిన రెండవ దశ ఇందిరమ్మ ఇళ్లను ముఖ్యమంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 3 వేల 500 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించామని, ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షల 50 వేల ఇళ్ల మంజూరు ప్రక్రియ చేపట్టామని వెల్లడించారు. అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి ఇల్లు అందేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..25.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను “యోగాంధ్ర-2026” పేరుతో ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేపట్టిందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన నిన్న మాట్లాడుతూ, ఈ ఏడాది “యోగ ఫర్ హెల్తీ ఏజింగ్” నినాదంతో ఈ నెల 7 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా రెండు వారాల పాటు యోగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 21న అమరావతిలో కృష్ణా నదిపై నిర్మించిన వెస్ట్ బైపాస్ వంతెనపై రాష్ట్ర స్థాయి ప్రధాన కార్యక్రమం జరగనుందని ముఖ్యమంత్రి పాల్గొంటారని మంత్రి తెలిపారు.

---------------------------

రైతుల ఆదాయం పెంచేందుకు ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా కొల్లిపర మండలం పాత బొమ్మువానిపాలెంలో నిర్వహించిన పామాయిల్ సాగు రైతుల అవగాహన సదస్సులో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రైతులకు అధిక ఆదాయం అందించే ప్రత్యామ్నాయ పంటగా ఆయిల్ పామ్ సాగు ఉపయోగపడుతుందని చెప్పారు. దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయం పొందేందుకు ఆయిల్ పామ్ పంట దోహదపడుతుందని మంత్రి పేర్కొంటూ..

వాయిస్...27 సెకన్లు

---------------------------

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం వేడుకలను – సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్ లో ఈరోజు నిర్వహిస్తారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి – ఉదయం పరేడ్ మైదానంలో జాతీయ జెండాను ఆవిష్కస్తారు. పోలీసు సిబ్బందికి అవార్డులను ప్రదానం చేస్తారు. అలాగే రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో నిర్వహించే వేడుకల్లో రాష్ట్ర మంత్రులు పాల్గొంటారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక రాష్ట్ర సాధన పోరాటంలో ప్రాణాలు అర్పించిన అమరుల త్యాగాలను

ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. అన్ని రంగాల్లో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచేలా సరికొత్త విధానాలతో.. భవిష్యత్తు ప్రణాళికలు రూపొందిస్తామని పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ప్రభుత్వ వసతి గృహాల మరమ్మతుల కోసం 143 కోట్ల రూపాయలను కేటాయించినట్లు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. ప్రకాశం జిల్లా ఒంగోలు సంతపేటలో నిర్మాణంలో ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహాల పనులను మంత్రి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిర్మాణ పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థినుల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అలాగే విద్యార్థుల ఉన్నత విద్యకు ప్రోత్సాహంగా రాష్ట్రంలో 13 ఐఐటీ, నీట్ శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

---------------------------

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు వివిధ పోటీలను నిర్వహిస్తున్నట్లు కర్నూలు జిల్లా కలెక్టర్ ఏ. సిరి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లోని కర్నూలు కలెక్టర్ కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ ప్రచార గోడ పత్రికను ఆమె నిన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల ఐదో తేదీన జరిగే ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని చెప్పారు. పోస్టర్, వ్యాసరచన, వక్తృత్వం, ఫోటోగ్రఫీ, సైన్స్ మోడల్స్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. తెలంగాణ, రాయలసీమ, తమిళనాడు మీదుగా ద్రోణి విస్తరించి ఉందని దీని ప్రభావంతో ఈ రోజు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.

తెలంగాణలోనూ ఈ రోజు, రేపు పలు జిల్లాల్లో తేలికపాటి నుండి ఒక మోస్తారు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ ప్రారంభంతో ప్రాంతీయ రైలు రవాణాలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని దక్షిణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ తెలిపారు. రైల్వే జోన్ ప్రారంభ కార్యక్రమంలో భాగంగా విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, గుంతకల్లు డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు, వివిధ శాఖల ప్రధానాధికారులతో విశాఖలో ఆయన నిన్న సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దక్షిణ కోస్తా రైల్వే వ్యవస్థ మ్యాప్ ను ఆవిష్కరించారు. అనంతరం సందీప్ మాథుర్ మాట్లాడుతూ, కొత్త జోన్ ఏర్పాటు ద్వారా పరిపాలనా సామర్థ్యం పెరగడంతో పాటు ప్రయాణికులు, సరకు రవాణా సేవలు మరింత మెరుగుపడతాయని చెప్పారు. ప్రాంతీయ మౌలిక వసతుల అభివృద్ధి, ఆర్థిక పురోగతికి ఈ జోన్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

====================